بِسْمِ اللّٰہِ الرَّحْمٰنِ الرَّحِیْمِ نَحْمَدُہٗ وَنُصَلّی عَلٰی رَسُوْلِہِ الْکَرِیْمِ وَعَلٰی عَبْدِہِ الْمَسِیحِ الْمَوْعُوْدِ

## హజ్రత్ అమీరుల్ మూమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఖుత్బా జుమా సారాంశము – బైతుల్ ఫుతూహ్ – లండన్

దివి: 23.05.2014 నజారత్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరము హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఆలె ఇమ్రాన్ అధ్యాయపు సూక్తులు 146 నుండి 149, 170 నుండి 172 వరకు పఠించిరి.

వీటిలో దైవమార్గములో ప్రాణ త్యాగపు ప్రాముఖ్యత, గొప్పదనము తెలుపబడెను. అల్లాహ్ దయ, ఉపకారముతో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంకు తమ ప్రతిజ్ఞల వాస్తవికతను గ్రహించు వారిని అందించెను. గ్రహించడమే కాక వాటి కొరకు నేటి కాలములో నిరుపమాణ ఉదాహరణలను నెలకొల్పుతురు. ధన త్యాగ విషయములో తన మతము కొరకు ధనమును త్యాగము చేసే వారెక్కడ అనగానే అహ్మదియ్యా సంస్థ సభ్యుల సమూహము ముందుకు వచ్చి నిలుచును. సహాయ త్యాగము గురించి పిలుపునిచ్చినప్పుడు మతము కొరకు సమయము త్యాగము చేసే ఉదాహరణలు అహ్మదియ్యా సంస్థలో గలవు. గౌరవ, మర్యాదల త్యాగ ఉదాహరణలు చూడాలంటే అహ్మదియ్యా సంస్థలో దాని ఉదాహరణలు కనిపించును. ఇస్లాం ప్రచారము కొరకు జీవితములను సమర్పించుటకు పిలుపునిచ్చినచో తమను తాము ప్రవేశపెట్టు సన్మిత్రుల సమూహము ముందుకు వచ్చును. ప్రాణ త్యాగ నిజమైన రూపమును చూడాలంటే అహ్మదియ్యా సంస్థ చరిత్ర ఈ నిజమైన త్యాగ రూపములను నిరూపించును.

అల్లాహ్ నుడివిన ఆదేశముల ప్రకారము, అల్లాహ్ కొరకైన ప్రతి త్యాగమునకు ఉదాహరణలను నెలకొల్పు వారిని అహ్మదియ్యా సంస్థలో అల్లాహ్ పుట్టించెను. అధికులు ధనము, ప్రాణము, సమయము, గౌరవమును త్యాగము చేసే వాస్తవము తెలిసి వుండడమే కాక ఎల్లప్పుడు సిద్ధముగా నున్న సంస్థను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంకు అల్లాహ్ ప్రసాదించెను. కాని విశ్వాసి స్థాయికి తగని విషయములను వ్యక్తపరచే వారు కూడ కొందరున్నారు. వీరి వలన పూర్తి శిక్షణ పొందని, పరిపక్వత చెందని వారు అవసరానికి మించి ప్రభావితులగుదురు. ఈ ఆపద, పరీక్ష కాలము సుదీర్ఘమగుచున్నదని కొందరు నాకు వ్రాయుదురు కూడ. ఆపద, పరీక్ష కాలము సుదీర్ఘమగుచున్నదని అల్లాహ్ త్వరగా ప్రశాంతతను కల్పించుగాక అను వరకైతే ఎలాంటి అభ్యంతరము లేదు. ఎందుకనగా కఠిన ఆపదలు అధికమైనప్పుడు ప్రవక్త, విశ్వాసుల సంస్థ కూడ مَتٰی نَصْرُ اللّٰہِ 'సహాయమెప్పుడని' నినదించును. ప్రార్థన కూడ చేయును. కాని ఇహలోక సంబంధాలు, కారణాల వైపు ఆకర్షణ వ్యక్తమగు విషయము విశ్వాసి స్థాయికి తగదు. ఉ॥ ఒకరు నాకిట్లు వ్రాసెను. పాకిస్తాన్‌లో సంస్థపై జరుగుచున్న మొత్తాన్ని మనము ప్రపంచానికి తెలుపవలెను. ఎమ్.టి.ఏ కూడ అధికంగా ఈ హింసను ప్రపంచానికి చూపవలెను. ఇతర మార్గాలను కూడ వాడుకొనవలెను. హింసకు వ్యతిరేకంగా ప్రపంచములో నినదించవలెను.

ఈ విషయములో మొదటగా గుర్తుంచుకోవలసిదేమనగా మనది దైవ సంస్థ అని మన ప్రకటన. కనుక ప్రాపంచిక ప్రభుత్వాలు లేదా ప్రాపంచిక నిరసనలను దైవ సంస్థలు నమ్మవని కూడ మనము గుర్తుంచుకోవలెను. దైవ సంస్థల అభివృద్ధిలో ప్రాపంచిక సహాయ పాత్ర లేదా హస్తముండదు. ప్రాపంచిక సహాయములు నిబంధనలు లేనిదే వుండవు. నిస్వార్థమై వుండవు. తమ ముందు ఏదో ఒక రకంగా మోకరిల్లుటకు బలవంతము చేయనిదే వుండవు. ఒక నిజమైన విశ్వాసి ఈ విషయములను సహించలేడు. విశ్వాసుల తరపున متیٰ نصر اللہ 'సహాయమెప్పుడను' పిలుపు అల్లాహ్ ఆస్థానములో సాష్టాంగ స్థితి, ప్రార్థన రూపములో వెలువడును. ఆపద, పరీక్షల కాలమును ఎదురీదుతూ మనము ప్రతి సారి అల్లాహ్ ఆస్థానములో సాష్టాంగములై అతని శుభములు, సహాయమును యాచింతుము. అతని సహాయమును కోరినప్పుడు ప్రగతి రూపములో క్రొత్త క్రొత్త మార్గములు మన ముందు తెరుచుకొనును.

ఈ ఆపద సంస్థ ప్రగతి కొరకు క్రొత్త క్రొత్త మార్గములు, నవీన గమ్యాలకు కారణమగుచున్నట్లు ప్రపంచవ్యాప్తముగా 204 దేశాలలో నివసించుచున్న సంస్థ సభ్యులు సాక్షులుగా నున్నారు. ఒక్క దేశములో ఆపద, పరీక్ష కాలము పొడుగైనదని బాధపడకూడదు. అల్లాహ్ అనుగ్రహములు ఎంత వరకు విస్తరించు చున్నవో చూడగలరు. ప్రాపంచిక వసతులను కూడ నిస్సందేహంగా వినియోగించవలెను. వసతుల వాడుక నిషేధము కాదు. వాటి ఉపయోగమునకు ఆజ్ఞ కూడ గలదు. ప్రాపంచిక పద్ధతులను ఉపయోగించుట నిషేధము కాదు. పరిమితులలో వుండి ఎంత వరకైతే ఈ ప్రాపంచిక పద్ధతులను ఉపయోగించవలెనో అల్లాహ్ కృపానుసారము వాటిని మనము ఉపయోగించుచున్నాము. ఏ విధంగా సంస్థ హింసకు గురగుచున్నదో ప్రపంచానికి కూడ తెలియజేయుచున్నాము. ప్రపంచమంతా కలిసి ఈ హింసలను అంతము చేయనిదే ఈ హింసలు వ్యాపించును, ఒక్క మానవుడు కూడ సురక్షితముగా వుండలేడని కూడ మనము చెప్పుచున్నాము. ఇవి వ్యాపించుచున్నట్లు ప్రపంచము చూచుచున్నది. ఇవన్నియు చెప్పినను మన నమ్మకము ఏ ప్రభుత్వము, మానవ హక్కుల సంఘముపై లేదు. అల్లాహ్‌పైనే మనకు నమ్మకము గలదు.

ప్రాపంచికుల, మన ఆలోచనలో చాలా వ్యత్యాసము గలదు. అల్లాహ్‌తో విజయ వాగ్దానములు పొందిన ఈ కాలపు ఇమామ్ బైఅత్ మనము చేసినాము. విజయముల నూతన ద్వారములు తెరుచుకొను వాగ్దానములు గలవు. మనము ఈ దృశ్యాలను కూడ చూచుచున్నాము. కాని ఇతరులకు ఇటువంటి వాగ్దానములు లేవు. షియా లేదా ఇతరుల ఉదాహరణ ఇవ్వబడును. బహిరంగ నిరసన తెలిపి వారు తమ లక్ష్యాలు పొందినట్లు నాకెక్కడా కనిపించలేదు. కాని విధ్వంసం, నిర్బంధనలు ప్రతి చోట తప్పక జరుగుచున్నవి. దీని వలన మరింత అశాంతి పెరుగుచున్నది.

పాకిస్తాన్ లేదా ఇతర దేశములలో ఇతరుల లేదా ప్రభుత్వాల తరపున చట్టం ముసుగులో జరుగుచున్న ఈ హింసలు నేటివి కావని మనము గుర్తుంచుకోవలెను. ఇది గత 2,3 దశాబ్దాల సమస్య కాదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మసీహ్ మౌవూద్ ప్రకటన చేసి ఒక సంస్థను స్థాపించినప్పటి నుండి ఇవి కొనసాగుచున్నవి. వారు వారి సంస్థ మొదటి నుండే ఈ హింసా కఠినములను భరించిరి. తుదకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వంశీయులు యాజమానులైన ఖాదియాన్ నగరములో వారు సురక్షితంగా లేనందున అక్కడి నుండి వలస వెళ్ళవలెనను ఆలోచన కూడ కలిగెను. మనమింకా ముందుకు వెళ్ళినచో

ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవితమంతా శత్రువుల వరుస హింసలను భరించుచు గడిపిరి.

వారు (స) ప్రపంచములో ప్రతి సమస్యలో ఒక ఉదాహరణను స్థాపించవలసి యుండెను. వారి అనుచరులు కూడ త్యాగ రూపములను చూపించిరి. అందుకే అల్లాహ్ వాగ్దానములు, అల్లాహ్ బోధన వారి దృష్టిలో యుండెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతిరూపముగా రావలసి యుండెను. అందుకే వారు కూడ తనను నమ్మినవారితో ఇట్లనిరి. నాతో నా సంస్థ వారితో ఈ హింస, క్రౌర్యము కొనసాగును, కష్టముల కాలములు వచ్చును. నాది పుష్పములు పరచిన దారి కాదు. ముల్లులపై నడవవలసి వచ్చును. వారెవరిని మోసగించలేదు. అహ్మదియ్య సంస్థలో చేరు ప్రతి ఒక్కరు కష్టములను భరించవలసి వచ్చునని తెలిసే ప్రవేశింతురు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హయాంలో హజ్రత్ సాహిబ్జాదహ్ అబ్దుల్లతీఫ్ షహీద్ గారిని పదే పదే నీవు నమ్మిన మసీహ్ మౌవూద్‌ను తిరస్కరించినచో నీకు ప్రాణగండం తప్పునని రాజు అనెను. వారికి ఆశ చూపెను. అల్లాహ్ తన బహుమానములకు నన్ను వారసున్ని చేస్తున్న మరణము నాకిచ్చుచున్నప్పుడు ఇహలోకము కొరకు నేనెందుకు నిరాకరింతును. మూర్ఖుల ప్రశ్న లేదా వ్యాపరము మీరు నాతో చేయగోరిరని వారు బదులిచ్చిరి. విశ్వాసుల ఈ గొప్పస్థాయినే అల్లాహ్ ఈ సూక్తులలో తెలిపెను.

فما وهنوا لما اصابهم فى سبيل الله وما ضعفوا وما استكانوا والله يحب الصبرين۔ (ఆలె ఇమ్రాన్:147)
అనగా అల్లాహ్ మార్గములో పోరుకు బలహీనతను గాని, అలసటను గాని లెక్క చేయలేదు. (శత్రువులకు) వారు లొంగలేదు. అల్లాహ్ శాంత చిత్తులను ప్రేమించును.

మా హింసల వలన వీరెందుకు బలహీనతను ప్రదర్శించరు, మా ముందెందుకు మోకరిల్లరని మన వ్యతిరేకులకు బాధ కలుగుతుంది. కాని ఒక నిజమైన అహ్మదీయుడు ఎల్లప్పుడు అల్లాహ్‌ను చూడును, అల్లాహ్ ప్రీతిని పొందుటకు సదా కృషి చేయునని వారికి తెలియదు. తమ దృఢత్వము కొరకు ఎల్లప్పుడు దుఆ చేయగలరని అల్లాహ్ ప్రీతిని పొందుటకు ఒక దుఆ కూడ అల్లాహ్ ఇక్కడ నేర్పెను. ఎందుకనగా విశ్వాస దృఢత్వము అల్లాహ్‌యే అందించును. ఈ విషయములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మన పోషకుడు అల్లాహ్ అని ప్రకటించి కల్పిత దేవుళ్ళ నుండి దూరమై, వివిధ పరీక్షలు, ఆపదలను తట్టుకొని స్థిరముగా నిలిచిన వారిని దైవదూతలు ఇట్లు ప్రోత్సహింతురు. మీరు భయపడకుము, బాధపడకుము, సంపూర్ణముగా ఆనందపడుము. ఎందుకనగా మీతో చేయబడిన వాగ్దానమునకు మీరు వారసులగుదురు. మేము ఇహపరలోకములో మీ మిత్రులము. ఇచట స్థిరత్వముతో అల్లాహ్ ప్రీతి కలుగునని సూచించెను. అద్భుతము కంటే స్థిరత్వము గొప్పదను విషయము నిజమే. నలువైపుల ఆపదలు చుట్టిముట్టి, అల్లాహ్ మార్గములో ప్రాణము, మర్యాద ప్రమాదములో నున్నప్పుడు, స్వస్థత కల్పించని వారెవరు లేనప్పుడు, తుదకు అల్లాహ్ కూడ పరీక్షగా తన స్వప్నము, వాణిని నిలిపివేసి భయంకర స్థితిలో వదిలినప్పుడు చూపినదే గొప్ప స్థిరత్వము. అప్పుడు బలనహీనత చూపక, పిరికివారి వలె వెనక్కి జరగక, విశ్వసనీయతలో తేడా రానివ్వకూడదు. స్వచ్ఛత, దృఢత్వములో తేడా రాకూడదు. అవమానముపై సంతోషపడవలెను, మరణముతో రాజీ పడవలెను. దృఢత్వముకై ఏ మిత్రుని సహాయమునకు నిరీక్షించకూడదు.

కనుక మనలో ప్రతి ఒక్కరు ఈ స్థితిని పొందుటకు ప్రయత్నించవలెను. ఇది అల్లాహ్ కరుణించనిదే సాధ్యము కాదు. మానవుడు ప్రతి త్యాగమునకు సిద్ధమైనప్పుడు అల్లాహ్ తన దాసున్ని వదలడు, సహాయపడును. అందుకే స్వర్గముల వాగ్దానము చేయుచున్నాడు. దృఢత్వము, శత్రువులపై విజయము పొందుటకు దుఆ కూడ నేర్పించెను. శత్రువు పారిపోవుటకు ఏ మార్గము పొందనట్లు అల్లాహ్ విజయముల ద్వారములు తెరుచుననే దీని భావము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో అల్లాహ్ తుది విజయముల వాగ్దానము చేసినట్లు తప్పక పూర్తగును. అంతిమ విజయము మనదే అగును.

ఈ త్యాగముల చరిత్రను వ్రాయు, అల్లాహ్ ద్వారా శుభవార్త పొందువారిలో నేడు మన మరొక సోదరుడు గౌ॥ ఖలీల్ అహ్మద్ గారు తండ్రి గౌ॥ ఫతహ్ ముహమ్మద్ గారు చేరినారు. వీరు భువేవాల్, జిల్లా షేఖుపూర వాసులు. వీరు 16 మే 2014 తేదీన షహీద్ చేయబడిరి. اناللہوانااليہراجعون۔

ఈ సంఘటన ఇట్లు గలదు. 13 మే 2014 తేదీన విరోధులు జమాఅత్‌కు వ్యతిరేకంగా గ్రామములో కట్టిన బ్యానరు విప్పినందుకు ఉద్రిక్తత స్థితి ఏర్పడెను. ఈ సమస్యను సాకుగా చూపి భువేవాల్, జిల్లా షేఖుపూరలో ఊరేగింపు నిర్వహించిరి. జమాఅత్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి ట్రాఫిక్ నిలిపివేసి కేసు పెట్టాలని బలవంతము చేసిరి. కావున నలుగురు అహ్మదీయులు ముబష్షిర్ అహ్మద్ గారు, గులాం అహ్మద్ గారు, ఖలీల్ అహ్మద్ గారు, ఇహ్సాన్ అహ్మద్ గార్లపై పోలీస్ కేసు పెట్టెను. ఎఫ్.ఐ.ఆర్‌లో చేర్చబడిన ఖలీల్ అహ్మద్ గారి, ఇతర నిందితుల బంధువులను అదుపులో తీసుకొని కారాగారములో బంధించిరి. కేసు తర్వాత ఇతర నిందితుల జామీను తీసుకోబడెను. ఖలీల్ అహ్మద్ గారి జామీను కొరకు కృషి జరుగుచుండెను. 16 మే 2014 తేదీ, శుక్రవారము రోజున పక్క గ్రామములో వుండే సలీమ్ నామము గల ఒక యువకుడు నేను భోజనము ఇచ్చుటకు వచ్చినాననే సాకుతో లోపలికి చేరి, ఖలీల్ అహ్మద్ ఎవరని అడిగెను. తెలుసుకున్న వెంటనే తుపాకీ తీసి ఖలీల్ అహ్మద్ గారి ముఖముపై కాల్చెను. దీనితో వారు తీవ్రంగా గాయపడిరి. హంతకుడు ఇతర అహ్మదీ ఖైదీలను కూడ కాల్చుటకు ప్రయత్నించెను. కాని తూటా తుపాకిలో చిక్కుకొని కాలలేదు. పోలీసులు నేరస్తున్ని అదుపులో తీసుకున్నారు. ఖలీల్ అహ్మద్ గారిని కారాగారము నుండి బయటికి తీసినారు. కాని అప్పటికే వారి ప్రాణాలు అల్లాహ్ సన్నిధిలో చేరిపోయెను. اناللہوانااليہراجعون۔

*Summary by : Nazarat Nashr-o-Ishat Qadian,*
*Telugu Translation by : Hafiz Syed Rasool Niyaz,*
*Telugu Desk Ahmadiyya Mohalla,P.O.: Qadian,*
*Dist: Gurdaspur, Pin: 143 516, Punjab*